క్లుప్తంగా

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు : గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో నాడు- నేడు రెండవ దశ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వ్యాయామ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నత్తానియేల్, ప్రసాద్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నత్తానియేలు, పీడీకేడీ ప్రసాద్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఉంగుటూరు: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. ఉంగుటూరు 1,2 సచివాలయాల పరిధిలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజానికి ప్రథమ శత్రువులు దోమలేనని అన్నారు. లార్వా దశలోని దోమ ఉత్పత్తిని ఆపాలన్నారు. గృహ పరిసరాల్లో నిల్వనీరు లేకుండా ఎప్పటికప్పుడు పారద్రోలాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె. ఎం శ్రీనివాసరావు, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు లర్దు మేరి, ఎస్తేరు, శైలజ , ఆశావర్కర్లు ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

భవిత సెంటర్ తనిఖీ



పోతునూరులో భవిత సెంటరును తనిఖీ చేస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి

దెందులూరు: భవిత సెంటర్‌ను మరింత బలోపేతం అయ్యేందుకు చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యపరిరక్షణ భవిత సిబ్బంది కృషి చేయాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పోతునూరు భవిత సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8 మంది చిన్నారులకు ఏడుగురు హాజరయ్యారు. రికార్డులను, పోషకపదార్థాలను పరిశీలించారు. భవిత సెంటర్ నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు కె కన్నాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేడు పెదవేగి మండలం కె కన్నాపురంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ శనివారం కె కన్నాపురం పంచాయతీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన జరుగుతుందని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని సతీష్ కోరారు.

ఈ-క్రాప్ నమోదులో పొరపాట్లు లేకుండా చూడాలి



పొలాల్లో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య

దెందులూరు: ఈ-క్రాప్ నమోదు విధానం వ్యవసాయ ఉద్యోగులు, ఆర్‌బీకే సిబ్బంది అంకిత భావంతో నమోదు చేయాలని ఆన్‌లైన్ ప్రక్రియ పొరపాట్లు లేకుండా చూడాలని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పోతునూరు, దోసపాడు గ్రామాల్లో వరిపొలాలల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతు పేరు, పొలం సర్వే నెంబరు, పంట, పొలం వివరాలు, ఈ-క్రాప్ నమోదు చేసిన అనంతరం ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. ఆయన వెంట రెండు గ్రామాల వీఆర్‌ఓలు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కె.కన్నాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వం లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు.పెదవేగి మండలం కె కన్నాపురంలో 113వ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆయనను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ముందుగా గ్రామంలో కార్యక్రమానికి ముందు శ్రీ గంగానమ్మ తల్లికి దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మించిన ప్రతి లబ్ధిదారులు ఎమ్మెల్యేకు హారతులు పట్టి, స్వాగతం పలికి, వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణాన్ని దగ్గరుండి చూపించి, సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు...

కె కన్నాపురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇతర పార్టీల నుంచి చేరిన వారితో నూతన వాతావరణం సందడిగా మారింది. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ కేశన సతీష్ ఆధ్వర్యంలో మరీదు కేశవ, మరీదు స్వాతీ, మల్లవెల్లి శ్రీనివాసరావు, మల్లవెల్లి సతీష్‌కుమార్‌లు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్. ముండూరు సొసైటీ అధ్యక్షులు చెరుకూరి ప్రసాదరావు, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, బొల్లి లక్ష్మణరావు, మారగాని సత్యనారాయణ, కట్టా నాగరాజు, ముత్యాల గణపతి, చినాల సత్యనారాయణ, కమ్మిలి నాగేంద్ర, మారగాని రామకృష్ణ, కమ్మిలి వెంకటరత్నం, చిలుకూరి రాంబాబు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డును పరిశీలించిన జేసీ



వట్లూరులో హౌసింగ్ బోర్డు స్థలాన్ని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టరు అరుణ్‌బాబు

పెదపాడు: మండలంలోని వట్లూరులో హౌసింగ్‌బోర్డు స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టరు పీ అరుణ్ బాబు పరిశీలించారు. హౌసింగ్ బోర్డు సంబంధించిన పొలంను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు దరఖాస్తు చేసుకోవడంతో సదరు పొలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు జేసీ అరుణ్‌బాబు పరిశీలన చేసారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, వీఆర్వోలు రాంబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సాగు సలహా మండలి అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ

భీమడోలు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, రైతులంతా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సాగు సలహా మండలి అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ అన్నారు. భీమడోలు వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం సాగు సలహా మండలి సమావేశం మండల అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న 13 వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం . అనంతరం జరిగిన సమావేశంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, తెగుళ్ల, వాటి నివారణ, పథకాలు, సబ్సిడీపై ఎరువులు, యంత్ర పరికరాలు తదితర అంశాలపై ఏవో ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి మండలి సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా పసుపులేటి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు రైతులకు ప్రభుత్వం యంత్ర పరికరాలు, పనిముట్లను 40శాతం సబ్సిడీకి అందిస్తుందన్నారు. రైతులకు అందాల్సిన పథకాల సొమ్మును సకాలంలో అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఏవో ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ మండలంలో 13, 736 ఏకరాల్లో నూరుశాతం దాళ్వా వరినాట్లు పూర్తి అయ్యాయన్నారు. ఇప్పటికే పంట నమోదు పూర్తి కాగా 50శాతం రైతుల మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఈనెల 20వ తేదీనాటికి పూర్తి చేయాలని సచివాలయ వ్యవసాయ సహాయకులకు సూచించారు. రైతులకు వ్యవసాయ పరికరాలను గ్రూపులకు 40శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పొలంబడి కార్యక్రమాన్ని ప్రతి వారం గురువారం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సలహా మండలి సభ్యుడు చెక్కా పుల్లయ్య, వీఏఏలు రూప, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు.. సంక్షేమ వారధులు



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: గృహసారథులు, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం శ్రీరామవరం ఆయన నివాసంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, అన్ని గ్రామాల గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ గృహసారథులు, కన్వీనర్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మమేకమై పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానిని సమిష్టిగా కృషి చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆశయాలకు అనుగుణంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గృహసారథులు సేవలందించాలని జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, జగనన్న సచివాలయ దెందులూరు మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామవరం గ్రామ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, అన్ని గ్రామాల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

గర్భిణిలు ఆరోగ్య నియమాలు పాటించాలి



గర్భిణిలకు పౌష్టికాహారం అందచేస్తున్న లయన్ సభ్యులు

గణపవరం: గర్భిణి మహిళలు వైద్యసిబ్బంది సూచించిన విధంగా పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌నాయుడు అన్నారు. శుక్రవారం గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో 100 మంది గర్భిణి మహిళలకు ప్రోటినెక్స్, వేరుశెనగ ఉండలు తదితర పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి సురక్ష మాతృత్వయోజన కార్యక్రమంలో 78 మంది గర్భిణి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18మంది గర్భిణిలను హైరిస్క్‌గా గుర్తించి, వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, లయన్ రీజియన్ చైర్మన్ వెల్లంకి నరేష్, గణపవరం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చవ్వారవి, లిప్ కోఆర్డినేటర్ నరేష్, సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్‌ఎన్ జి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ వేదకుమారికి సత్కారం



వేదకుమారిని సత్కరిస్తున్న వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మండల కొండలరావు

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారు ఆలయ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారిని ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బోర్డు డైరెక్టర్‌గా ముస్సే శ్రీను ఇద్దరిని బీసీ కులాలకు చెందిన వారి ఉన్నత పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మండల కొండలరావు అన్నారు. శుక్రవారం దెందులూరు వేదకుమారిని అమ్మవారి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు ప్రముఖ దేవస్థానాలకు బోర్డు డైరెక్టర్లు అయిన దెందులూరు నియోజకవర్గంలో రెండు మండలాలకు చెందిన బీసీ సామాజిక వర్గాల వైఎస్సార్‌సీపీ నేతలకు ఉన్నతమైన పదవులు ఇవ్వడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ల కృషి ఎన్నటికీ మరువలేనన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పెదవేగి : మండలంలో జగనన్న లేఔట్‌ల్లో గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జి రాజ్ మనోజ్ అధికారులను ఆదేశించారు. మండలం లోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ఆర్‌బీకే కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్‌లు, సచివాలయ భవనాలు తదితర అంశాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహాలు త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇటుక సకాలంలో సరఫరా చేయిస్తే లబ్ధిదారుల్లో చైతన్యం పెరిగి తమ గృహాలు వేగంగా నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. దశల వారిగా చెల్లించ వలసిన బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ఎంపీడీఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

ఆలయ అభివృద్ధి దాతల సహకారం అభినందనీయం



సత్యవోలు గ్రామంలో శివాలయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలో శివాలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ నిర్మాణ కర్త బంకురు నారాయణరావు అన్నారు. ఆలయ నిర్మాణ కర్త బంకురు నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం వేదపండితులతో హోమం నిర్వహించారు. దాతల సహకారంతో శివాలయం నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బొమ్మి జోగేశ్వరరావు, సొంగల మహేశ్వరరావు, గండివలస బాల కృష్ణారావు, బొమ్మి ప్రభాకరరావు, తంగుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామాల భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆకతాయిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

కొయ్యలగూడెం: బాలిక వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న ఆకతాయిపై చర్యలు తీసుకోవాలంటూ గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామ స్తులు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ ఎదురుగా 100 మందికి పైగా గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెంకు చెందిన ఎంబీ విష్ణు కొద్ది కాలంగా చొప్పరామన్నగూడెంకు చెందిన హైస్కూల్ విద్యార్థిని వెంట పడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. బాలిక తన కుటుంబీకులకు విషయం తెలపగా ఆమె సోదరుడు ఆకతాయిని గవరవరం జెడ్పీ హైస్కూల్ వద్ద నిలదీశాడు. ఆ సమయంలో విష్ణు అతని అనుచరులు బాలిక సోదరుడు, తండ్రిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ నేపథ్యంలో యువకుడితోపాటు అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కామవరపుకోట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కామవరపుకోట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డిగ్రీ చదివే సీనియర్ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం (2022-23)లో డిగ్రీలో చేరిన జూనియర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులంతా కలిసి మెలిసి ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆడమిల్లి సర్పంచ్ జి.కేశవరావు మాట్లా డుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

చురుగ్గా మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు



పట్టిసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వి.సుమతి

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆమె పట్టిసంలో ఉత్సవ పనులను శుక్రవారం పరిశీలించారు. భక్తులు కాలినడకన పంట్లు ఎక్కే మార్గంలో ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. మూడు పంట్లు వచ్చాయని, వాటితో ఫ్లాట్‌ఫారం, జెట్టీలు కడుతున్నారని తెలిపారు. ఇసుక తిన్నెలపై నీడకు షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మంచినీటి వసతి కోసం ఇసుక తిన్నెలపై చేతి పంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివక్షేత్రం వద్ద ఫ్లాట్‌ఫారం పనులు వేగవంతం చేసినట్టు తెలిపారు.

వింజరం పీహెచ్‌సీ పరిశీలన

పోలవరం మండలం వింజరం గ్రామ పీహెచ్‌సీని తహసీల్దార్ బి.సుమతి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల మందులు ఉన్నాయా లేదా అనే విషయాలను వైద్యాధికారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీకి ఎంతమంది పేషెంట్లు హాజరవుతున్నారన్న విషయంపై ఆరా తీశారు. డీటీ కాజా రమేష్ తదితరులు ఉన్నారు.

ధ్వజస్తంభం ఇత్తడి తాపడం పనులకు విరాళం



కొయ్యలగూడెంలో ధ్వజస్తంభం ఇత్తడి తాపడం పనులకు బిందెలు సమర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణిసత్యభామ సమేత మద న గోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా భక్తుల నుంచి ఇత్తడి సేకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో స్వామివారి ఆలయాన్ని పునర్నిర్మించా రు. ఈ నేపథ్యంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభ ఇత్తడి తాపడానికి గ్రామంలో చిన్నారు లు, పెద్దలు పెద్ద ఎత్తున ఇళ్లలోని ఇత్తడి సామగ్రిని అందజేస్తున్నారు. సుమారు 300 కేజీలతో ఇత్తడి తాపడం పనులు ప్రారంభిస్తున్నామని పాలక మండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు. ఇత్తడి పాత్రలను అందజేసే వారు నేరుగా ఆలయం వద్ద పురోహితులు శేషాచార్యులకు లేదా కమిటీ సభ్యులకు అందజేయాల్సిందిగా సూచించారు. ఈనెల 27 నుంచి మార్చి 6వరకు ఆలయ ప్రారంభోత్సవ, విగ్ర హ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పీహెచ్‌సీని జిల్లాలో అగ్రభాగాన నిలపాలి



పెదపాడు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేపట్టిన జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు

పెదపాడు: పీహెచ్‌సీని జిల్లాలో అగ్రభాగాన నిలపేందుకు కృషిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పెదపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలను, సిబ్బంది సేవల స్థాయిని రికార్డులను పరిశీలించారు. గర్భిణీల వివరాలు, లోపపోషణ కలిగిన వారి వివరాలు, కాన్పుల చేస్తున్న వివరాలు , సిబ్బంది చేయాల్సిన పనులను రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ సిబ్బంది కాళీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌లోని లాబ్‌ను పార్మసీని, స్టాక్‌రూమ్‌ను, ఆపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. డాక్టర్ల పనితీరును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టరు చక్రధర్, డాక్టరు కే అనంతపాల్ ఈఓఆర్డీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

పెదపాడులోని కేఆర్ పాలెంలోని లేఅవుట్‌ను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి కరెంటు కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. లేఅవుట్లోని లబ్ధిదారులు ఎంతమంది కడుతున్నారని ఆరా తీసారు. ఇళ్ల ఒక్కొక్కరికి రూ.3లక్షల విలువైన ఇళ్ల స్థలాన్ని అందించామని ఎందుకు నిర్మాణం మొదలు పెట్టలేదో కారణం తెలుసుకుని కట్టకపోతే వారిని రాతపూర్వక పత్రాన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా రుణాలు అందించిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే డబ్బులు వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. ఉగాది నాటికి వీలైనన్ని ఎక్కువ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పెదపాడులోని ఎస్‌డబ్ల్యుఎమ్ షెడ్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఈఓఆర్డీ ఎస్ సూర్యకుమార్, పెదపాడు ఈఓ వినోద్‌కుమార్, వీఆర్వో నటరాజన్ దాసు డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.